


వివరాలు మెయిన్‌లో

**ఆర్‌టిసి కార్మికుల ఐక్య పోరాటంతో 32 డిమాండ్లు సాధించాం**


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 13 మే, 2026 | పేజీలు : 07


# పాడి రైతుకు సర్కార్ అభయం!

## నార్ముల్‌కు 'బీర్ల' సంకల్పం..

**బిల్ కలెక్టర్ నుంచి ఎమ్మెల్యేగా.. మాతృసంస్థపై మమకారం చాటుకున్న అయిలయ్య**

**ముఖ్యమంత్రిని ఒప్పించి, క్యాబినెట్ ఆమోదమే లక్ష్యంగా 'అన్ని తానై' నార్ముల్ పునర్జీవం!**

**ఎన్‌డిడిబితో నార్ముల్ ఎంఒయు.. రైతులకు రూ. 10 కోట్ల బకాయిల చెక్కు అందజేత**








**ప్రజాపక్షం/యాదాద్రి** : రాజకీయాల్లో పదవులు రావచ్చు.. పోవచ్చు.. కానీ తాను పుట్టి పెరిగిన నేలను, తన ఎదుగుదలకు కారణమైన సంస్థను మర్చిపోని నాయకులు అరుదుగా ఉంటారు. ఆ అరుదైన కోవకే చెందుతారు ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య. ఒకప్పుడు ఉమ్మడి నల్లగొండ రంగారెడ్డి జిల్లాల పాడి రైతుల ఇంటి మహాలక్ష్మి గా వెలిగి, గత పదేళ్లుగా నష్టాల సుడిగుండంలో చిక్కుకున్న 'నార్ముల్' డైరీకి ఎన్ డి డి బి ద్వారా పూర్వ వైభవం తీసుకురావడానికి ఆయన కీలక పాత్ర పోషిస్తోన్నారు. ప్రజా ప్రభుత్వం సంకల్పించిన ఈ బృహత్తర పునరుద్ధరణ ప్రణాళిక వెనుక ఒక సామాన్య బిల్ కలెక్టర్ స్థాయి నుండి ఎదిగిన పాడి రైతు బిడ్డ పట్టుదల, తన మాతృసంస్థపై ఉన్న అపార మమకారం దాగి ఉన్నాయి.

**ముఖ్యమంత్రిని ఒప్పించి.. 'మాస్టర్ ప్లాన్' సిద్ధం చేసి!**

నార్ముల్ సమస్యను కేవలం ఒక వినతిపత్రానికే పరిమితం చేయకుండా, దానిని పరిష్కరించే వరకు నిద్రపోని పట్టుదలను ఐలయ్య ప్రదర్శించారు. నార్ముల్ పాలకవర్గాన్ని వెన్నంటి ఉండి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గరకు తీసుకెళ్లి, క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించారు. సంస్థను కాపాడాలంటే జాతీయ డైరీ అభివృద్ధి బోర్డు (ఎన్ డి డి బి) భాగస్వామ్యం ఒక్కటే మార్గమని ముఖ్యమంత్రిని ఒప్పించడంలో ఆయన విజయం సాధించారు. మే 04న జరిగిన క్యాబినెట్ సమావేశంలో నార్ముల్ పునరుద్ధరణకు ఎన్ డి డి బికి అప్పగించడానికి కావాల్సిన ఆమోదం లభించడం వెనుక ఐలయ్య నిరంతర పర్యవేక్షణ, అధికారులతో జరిపిన సమన్వయం కీలక పాత్ర పోషించాయి.

**ఎంఒయు కుదిరింది.. బకాయిల చెల్లింపు మొదలైంది!**

నార్ముల్ పునరుద్ధరణ కోసం జాతీయ డైరీ అభివృద్ధి బోర్డు భాగస్వామ్యం ఒక్కటే మార్గమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ఒప్పించడంలో ఐలయ్య విజయం సాధించారు. ఇందులో భాగంగానే నేడు నార్ముల్ ఎన్ డీ డీ బీ మధ్య ఒప్పందం కుదిరింది. ఒప్పందం కుదిరిన వెంటనే పాడి రైతుల పెండింగ్ బకాయిలను చెల్లించడానికి ఎన్ డీ డీ బీ రూ. 10 కోట్ల చెక్ ను నార్ముల్ యాజమాన్యానికి అందజేసింది. సంస్థకు ఉన్న రూ. 42 కోట్ల బ్యాంకు అప్పులను తీర్చేందుకు ఎన్ డీ డీ బీ సుముఖత వ్యక్తం చేసింది. 20 వేల లీటర్లకు పడిపోయిన సేకరణను, తిరిగి 1.50 లక్షల లీటర్ల స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**ప్రజా ప్రభుత్వం - పాడి రైతుకు భరోసా**

రైతు సంక్షేమమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన ఈ 'మాస్టర్ ప్లాన్' పాడి రంగంలో కొత్త వెలుగులు నింపనుంది. నార్ముల్ పాడి రైతులకు బకాయి పడి ఉన్న బిల్లలను చెల్లించడానికి ఎన్ డి డి బి ఎంవోయూ చేసుకున్న తరువాత రూ.10 కోట్లు ఇవ్వడానికి అంగీకరించింది. అలాగే ప్లాంటు నిర్వహణ కోసం ఏడాదికి రూ. 5కోట్లు చెల్లించనుంది. నార్ముల్ సేకరించిన పాలపైన లీటర్ కు రూ.6.50 పైసలు ఇవ్వనుంది. నార్ముల్ సంస్థకు చెందిన భూములను తీసుకొని రూ.42 కోట్లు బ్యాంకు అప్పులు చెల్లించడానికి సుముఖంగా ఉంది.

**నార్ముల్ మళ్ళీ చిగురిస్తోంది!**

ఒకప్పుడు 1.35 లక్షల లీటర్ల సేకరణ జరిగిన నార్ముల్, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల 20 వేల లీటర్లకు పడిపోయింది. కానీ ఇప్పుడు ఐలయ్య గారి పర్యవేక్షణలో, ప్రభుత్వ సహకారంతో మళ్ళీ లక్షన్నర లీటర్ల లక్ష్యాన్ని చేరేందుకు సిద్ధమైంది.

'నార్ముల్ నా కుటుంబం.. ఆ సంస్థను కాపాడుకోవడం నా బాధ్యత' అని చాటిచెప్పిన బీర్ల ఐలయ్య కృషిని ఉమ్మడి జిల్లాల పాడి రైతులు కొనియాడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికత, ఐలయ్య కార్యదక్షత తోడై నార్ముల్ మళ్ళీ 'శ్వేత విప్లవానికి' వేదిక కాబోతోంది.

# ధాన్యం అన్‌లోడ్‌లో జాప్యం చేస్తే కఠిన చర్యలు

**నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**

**రోజుకు 25 వేల టన్నుల కొనుగోలు లక్ష్యం**

**మిర్యాలగూడ మిల్లులపై ప్రత్యేక దృష్టి**



**ప్రజాపక్షం/నల్లగొండ:** మిల్లుల వద్ద ధాన్యం దించుకోవడంలో జాప్యం జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.మంగళవారం హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.జిల్లాలో ప్రతిరోజు కనీసం 20 నుండి 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసే లక్ష్యంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. మిల్లుల వద్ద వచ్చిన దాన్యం లారీలు ,ఇతర వాహనాలు ఎట్టి పరిస్థితులలో వెంట వెంటనే అన్లోడ్ కావాలని, ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, ఒకవేళ ఎవరైనా జాప్యం చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రేడ్ఏ,కామన్ వెరైటీ ధాన్యాన్ని కలిపి మిల్లులకు పంపించవద్దని,ట్రక్ చీటీలు సకాలంలో తెప్పించుకోవాలని ఆదేశించారు.మిర్యాలగూడ మిల్లుల్లో 1.34 లక్షల టన్నుల ధాన్యం అన్‌లోడ్ చేసే సామర్థ్యం ఉందని,అక్కడి మిల్లులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.జిల్లాలో ఇంకా 2.60 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని తెలిపారు.మిల్లర్లు ఉద్దేశపూర్వకంగా ధాన్యం తీసుకోకుంటే పోలీస్ సహకారం తీసుకుంటామని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ స్పష్టం చేశారు.జిల్లా నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రెవిన్యూ అదనపు కలెక్టర్ కలెక్టర్ జె. శ్రీనివాస్,పౌరసరఫరాల డిఎం రాంపతి నాయక్,పౌరసరఫరాల అధికారి వెంకటేశం, డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి, డిసిఓ పత్యా నాయక్,మార్కెటింగ్ ఎడి చాయ దేవి,వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శ్రవణ్ కుమార్ హాజరయ్యారు.

## ప్రభుత్వ ఐటిఐలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** 2026/27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ ఐటీఐ (బాలికలు/న్యూ),నల్లగొండలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రిన్సిపాల్ జంజిరాల వెంకన్న తెలిపారు.ప్రభుత్వ ఐటీఐ,ఏటీసీ,సీఏటీయూల్లో అడ్మిషన్ కోరుకునే విద్యార్థులు మే 14 నుంచి జూన్ 8 వరకు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీ,విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని చెప్పారు. దరఖాస్తు సమయంలో ఎస్ఎస్‌సి మెమో ప్రకారం పేరు,తండ్రి, తల్లి పేర్లు ఖచ్చితంగా నమోదు చేయాలని,ఇటీవలి పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో జత చేయాలని సూచించారు.

## నైపుణ్యాలతోనే మెరుగైన ఉపాధి అవకాశాలు



**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** నైపుణ్యాలతోనే ప్రపంచవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు.విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన టీచర్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో 100 మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 20 మంది వివిధ పాఠశాలల్లో అధ్యాపకులుగా నియామకానికి అర్హత సాధించారని ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ హరీష్ కుమార్ తెలిపారు.స్పృహ,సాధనతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు వీసీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, డాక్టర్ వై. శ్రీనివాస్ రెడ్డి, ఇన్నోక్యూటర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/పాలకవీడు:** హనుమాన్ జయంతి వేడుకలను మంగళవారం మండలంలోని బెట్టెతండాలో అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జై వీర హనుమాన్, జై శ్రీరామ్ అనే నినాదాలతో హోరెత్తించారు. ఉదయం నుంచే తండాలోని ఆంజనేయ స్వామి దేవాలయానికి స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. పూజారి వెంకన్న నేతృత్వంలో పెద్ద ఎత్తున పూజలు, భజనలు, హనుమాన్ చాలీసా సంకీర్తనలు, పంచామృతాలు, అభిషేకాలు, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ మాలోతు మోతీలాల్ నాయక్, ఎయిర్‌పోర్టు అధికారి సోమ్లా నాయక్‌ల ఆర్థిక సహకారంతో సుమారు రెండువేల మందికి అన్నదానం ఏర్పాటు చేయగా, సర్పంచ్ మాలోతు బుజ్జిమోతిలాల్ అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సజ్జాపురం సర్పంచ్ ఎర్రెడ్ల సైదమ్మ గణపతిరెడ్డి, ఉప సర్పంచ్ బండావత్ కిసన్, వార్డు సభ్యులు మధు, శ్రీను, నాగేశ్వరరావు, శివాజీ, నాగేందర్, విక్రమ్, శ్రీను, సుధీర్, కిషన్ రమేష్, సోమ్లా రమణ పాల్గొన్నారు.



# మిల్లుల వద్ద నిలిచిన అన్ లోడింగ్...

### రంగంలోకి దిగిన రెవెన్యూ యంత్రాంగం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రెవెన్యూ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం నుంచే ఆర్డీవో రమణారెడ్డి రెవెన్యూ అధికారులతో కలిసి మిల్లుల వద్ద పర్యవేక్షణ చేపట్టారు. శెట్టిపాలెం, యాద్గార్‌పల్లి, గూడూరు పరిసర ప్రాంతాల్లోని రైస్ మిల్లుల్లో అన్‌లోడింగ్ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందో రికార్డుల ద్వారా ఆరా తీశారు. ఐకేపీ సెంటర్లలో ఎగుమతి సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే, మిల్లులకు చేరిన ధాన్యం లారీలను ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలని మిల్లు యజమాన్యాలకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. మిల్లుల వద్ద జాప్యం జరిగితే సహించేది లేదని, రైతుల ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను స్వయంగా పరిశీలిస్తూ మిల్లు యాజమాన్యాలకు తగిన సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్లు శ్రీనివాస్, జవహర్‌లాల్, హేమలత, సరోజ, చంద్రశేఖర్, రాగ్యానాయక్, కృష్ణయ్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర అభివృద్ధికి మూలం విద్య



**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** దేశ సమగ్ర అభివృద్ధికి మూల సాధనం విద్య అని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాల సందర్భంగా ఎంజీయూ ఆధ్వర్యంలో మంగళవారం విద్యా విధానంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ సరైన ప్రణాళికతో పరిశోధనలపై దృష్టి సారించి ఉన్నత విద్యాలయాలు మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉస్మానియా విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు శివారెడ్డి మాట్లాడుతూ,జాతీయ విద్యా విధానం 2020 సమగ్ర మార్పులను సూచిస్తుందన్నారు. బాల్యం నుంచే బలమైన పునాదులు వేయడం, విద్యార్థులకు సబ్జెక్టుల ఎంపికలో స్వేచ్ఛ, నాణ్యత,జవాబుదారితనంపై దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర విద్యా విధానాన్ని వివరిస్తూ, విద్యను మార్కులు,ర్యాంకులతో కాకుండా జ్ఞానం,విమర్శనాత్మక ఆలోచన, నైతిక బలం,సామాజిక బాధ్యత ఆధారంగా అంచనా వేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి,ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ వై.ప్రశాంతి,వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు,అధ్యాపకులు పాల్గొన్నారు.

# 13న పాలిసెట్-2026 పరీక్ష ఏర్పాట్లు పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఈనెల 13న నిర్వహించనున్న పాలిసెట్2026 పరీక్షకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు.మంగళవారం తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన,జిల్లాలో మొత్తం 15 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.నల్లగొండ పట్టణంలో 13,నాగార్జునసాగర్‌లో 2 కేంద్రాలు ఉన్నాయని, 5810 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరుగుతుందని చెప్పారు.పరీక్ష సజావుగా జరిగేందుకు పోలీస్ బందోబస్తు, పేపర్ ఎస్కార్ట్, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్స సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిధిలో బీఎన్ఎస్ 163వ సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.ఆర్టీసీ అధికారులు అవసరమైన బస్సులను నడపాలని సూచించారు.సమావేశంలో పాలిసెట్2026 జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ నరసింహారావు, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

# రెమిడీయల్ శిక్షణ తరగతులను సందర్శన




**ప్రజాపక్షం/కోదాడ:** పదవ తరగతి సప్లమెంటరి పరీక్షల కోసం విద్యార్థులకు రెమిడీయల్ ప్రత్యేక శిక్షణ తరగతులను జిల్లా బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పరిశీలకులు హరికృష్ణ, శ్రవణ్‌కుమార్ శిక్షణ కేంద్రంను సందర్శించి మాట్లాడారు. కోదాడ నియోజకవర్గంలో ఐదు మండలాల కోదాడ, అనంతగిరి, చిలుకూరు, మునగాల, నడిగూడెం సంబంధించి పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలు రాయనున్న విద్యార్థులు రెమిడీలు శిక్షణ తరగతులకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, గణితం, సైన్స్ సబ్జెక్టుల సంబంధించిన 45మంది విద్యార్థులు, సబ్జెక్టు ఉపాధ్యాయులు ఈనెల 12 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుండి 12గంటల వరకు కాల నిర్ణయ పట్టిక ప్రకారం వివిధ సబ్జెక్టులలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ మండల విద్యాధికారి సలీంషరిఫ్, మునగాల మండల విద్యాధికారి పి.వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి ఎల్. దేవరాజ్, రెమిడియల్ క్యాంపు కోఆర్డినేటర్ మార్కెండేయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## యోగాతో శారీరక మానసిక ఆరోగ్యం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** యోగాతో సంపూర్ణ శారీరక,మానసిక ఆరోగ్యం కలుగుతుందని నల్లగొండకు చెందిన ప్రముఖ యోగా గురువు ఆచార్య శివ అన్నారు. మంగళవారం నాగార్జున ప్రభుత్వ (ఎన్‌జి)కళాశాలలో ప్రగతి పాలన విద్యా వారోత్సవాలలో భాగంగా ఆచార్య శివ కళాశాల అధ్యాపకులకు, విద్యార్థులకు యోగా పట్ల అవగాహన కల్పించి సూక్ష్మ యోగా శిక్షణను ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మనసు శరీరాల కలయికే యోగా అని అన్నారు. ఈనాడు ప్రపంచ వ్యాపంగా సుమారు 179 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్,ప్రణాళిక సమన్వయకర్త డాక్టర్ పరంగి రవి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫసర్ అంతటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఫీజుల నియంత్రణ చర్యలు ఎక్కడ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలల యాజమాన్యాలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను ప్రభుత్వం ఎందుకు నియంత్రించడం లేదని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ప్రశ్నించారు. మంగళవారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్య వ్యాపారంగా మారి సామాన్య ప్రజలు చదువుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. విద్యా వ్యాపారంగా కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదన్నారు. పిల్లల్ని చదివించుకోవాలంటే భూమి లేదా బంగారం అమ్ముకున్నా కూడా ఫీజులకు సరిపోని పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో జక్క నాగేశ్వర్‌రావు, కొర్ర పిడిత సురేష్, ఉపేందర్, రమేష్, ఉదయ్, రామ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తి భావంతో ముక్తి మార్గం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** భక్తి భావంతో ముక్తి మార్గం పొందవచ్చని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకోని పట్టణంలోని చర్చిరోడ్డులో గల ఆంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానం ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధాబాలకృష్ణ, వైస్ ఛైర్మన్ గుడిపాటి శిరీషనవీన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటేష్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షా పేపర్ లీక్ చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని టీడీపీ నాయకులు పోగుల సైదులుగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ డాక్టర్ కావాలనే లక్ష్యంతో విద్యార్థులు కష్టపడి చదివి నీట్ పరీక్షను రాయగా పేపర్ లీక్ వార్తతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. సంవత్సరం పాటు కష్టపడి చదివిన విద్యార్థుల శ్రమను కొంత మంది డబ్బు కోసం నాశనం చేయడం దారుణమన్నారు. ఇలాంటి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. పారదర్శకంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



## ఉచిత ఆంగ్ల విద్య అందించడమే లక్ష్యం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** పేద విద్యార్థులకు నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్యను ఉచితంగా అందించి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దడమే ఉద్దీపన వివిఎం ఇంగ్లీష్ మీడియం ఫ్రీ స్కూల్ లక్ష్యమని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.సోమవారం ఆపాఠశాల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు.పేదరికం విద్యకు అడ్డుకాకూడదనే ఉద్దేశంతో ఈ పాఠశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులకు డిజిటల్ తరగతులు,లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, క్రీడా సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. నేటి నుంచే అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు,నాయకులు చౌగోని శ్రీనివాస్ గౌడ్,పన్నాల రాఘవరెడ్డి,బి.ప్రకాష్ రావు, పాఠశాల ప్రిన్సిపల్ గంగాధర భద్రయ్య,ఉద్దీపన పాఠశాల కోఆర్డినేటర్ చెరుకు సతీష్, గాజుల సుకన్య పాల్గొన్నారు.

## కనుమరుగవుతున్న ఆచారాలను పరిరక్షించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆనవాయితీగా వస్తున్న ఆచారాలు, సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తడకమళ్ల గ్రామంలో నిర్వహించిన లింగమంతుల స్వామి, సౌడమ్మ తల్లి జాతర మహోత్సవ వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలుగా మారాయని అన్నారు. గ్రామ సర్పంచ్ మేక సైదులు, ఉప సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, వార్డు, సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి, వేణుగోపాలస్వామి కల్యాణం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని తుంగపాడు గ్రామంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను, శ్రీ ఉమామహేశ్వరస్వామి శ్రీ ప్రసన్నాంజనయేస్వామి దేవాలయంలో శ్రీ హనుమాన్ జయంతి వేడుకలతో పాటు రిక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ సజ్జల మన్మధరెడ్డి, వైస్ ఛైర్మన్ అనుముల సైదులు, ఆలయ పూజారి సాయిబాబాశర్మ, సర్పంచ్ బెడదూరి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



## రంగుల చిలకకు శస్త్ర చికిత్సతో గుడ్డు తొలగింపు



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణ ప్రాంతీయ పశు వైద్యశాలలో గుడ్డు పెట్టలేక సతమతమవుతున్న ప్రేమ పక్షికి శస్త్ర చికిత్సనిర్వహించి గుడ్డు బైటకు తీసిన అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య అన్నారు. రంగుల చిలుకలు, ప్రేమ పక్షులు, లవ్ బర్డ్స్ అని రకరకాలుగా ముద్దుగా పిలుచుకునే ఈ అతి చిన్న అందమైన పక్షులు మనుష్యులతో త్వరగా మమేకమై ఉండే లక్షణం ఉండటంతో అనాది నుండి ఆసక్తి గల వారు ప్రేమతో ఇళ్లలో పెంచుకుంటున్నారు. వీటికి మేతగా కేవలం గింజలను మాత్రమే వేయడంతో కాల్షియం, విటమిన్ డి3, ఇతర మూలకాల లోపం వల్ల గుడ్డు తయారయ్యాక బైటకు రాకుండా లోపలే ఉండి ఆయాసం, నొప్పులతో బాధ పడుతూ మేత తినకుండా నీరసిస్తుంది. సకాలంలో స్పందించకపోతే మరణం కూడా సంభవిస్తుందని అన్నారు. రంగుల చిలకలు పెంచే వారు విధిగా కాల్షియం, బహుళ విటమిన్స్, ఖనిజలవన మిశ్రమాలు ఇవ్వాలని, తక్షణ శక్తికి ఎలక్ట్రోలైట్స్ ఇచ్చి సకాలంలో గుడ్డు పెట్టకపోతే పశువైద్యులను సంప్రదించి చిలుకలను రక్షించుకోవాలన్నారు. వైద్య సిబ్బంది రాజు, చంద్రకళ, రమేష్ పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్ అభివృద్ధి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తా



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అభివృద్ధిని ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేలా కృషి చేస్తానని సూర్యాపేట జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు, గరిడేపల్లి మండలం రాయినిగూడెం సర్పంచ్ గుండు రామాంజీగౌడ్ అన్నారు. సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా గుండు రామాంజీగౌడ్‌ను మంగళవారం హుజూర్‌నగర్ సిపిఐ పార్టీ కార్యాలయంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంంగా గుండు రామాంజీగౌడ్ మాట్లాడుతూ వేలకోట్ల రూపాయల నిధులతో నియోజకవర్గంలో నీటిపారుదల ప్రాజెక్టులు, విద్యా, ఉపాధి కల్పనా అంశాలు, పేదలకు గృహ వైద్య సేవలతో పాటు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు మంత్రి శ్రీకారం చుట్టారని అన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు ఆధ్వర్యంలో జరిగినీ సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శిగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎదిగిన రామంజీగౌడ్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ, చెన్నగాని సైదులు, యల్లావుల రమేష్, నాయకులు గుండు శంభయ్య, ఎస్‌కె చాంద్‌పాషా, బెక్కం విజయ్, మేకపోతుల రాంబాబు పాల్గొన్నారు.

## మామిడి విక్రయ కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** వేసవిలో మామిడి పండ్ల విక్రయాలు పెరగడంతో వినియోగదారుల ఆరోగ్య రక్షణలో భాగంగా పట్టణంలోని మామిడి విక్రయ కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు రెండు రోజుల పాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఎన్. శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో న్యూ ఎన్‌జీఎఫ్ ఫ్రూట్ కంపెనీ,మదీనా ఫ్రూట్ మర్చంట్స్,అమీర్ ఫ్రూట్స్,హీరా ఫ్రూట్స్‌తో పాటు రోడ్డు పక్కన వ్యాపారం చేస్తున్న విక్రేతలను పరిశీలించారు.తనిఖీల్లో వ్యాపారులు మామిడి పండ్లను మగ్గించేందుకు ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలకు అనుగుణంగా అనుమతించిన గోల్డ్ రైప్,ఎన్‌రైప్ వంటి ఇథిలీన్ గ్యాస్ సాచెట్లను వినియోగిస్తున్నట్లు గుర్తించారు.అన్ని విక్రయ కేంద్రాల్లో చెల్లుబాటు అయ్యే ఫుడ్ సేఫ్టీ లైసెన్సులు ఉన్నాయని,ఎక్కడా హానికరమైన కాల్షియం కార్బైడ్ వినియోగం కనిపించలేదని అధికారులు తెలిపారు.అనుమానాస్పదంగా ఉన్న మామిడి పండ్ల నమూనాలను సేకరించి విశ్లేషణకు పంపించారు.పండ్లను సురక్షిత పద్ధతుల్లో మగ్గించడం,పరిశుభ్రత పాటించడం, నాణ్యమైన పండ్లు అందించాలని వ్యాపారులకు సూచించారు. ఎక్కడైనా కాల్షియం కార్బైడ్ వినియోగం గుర్తిస్తే వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## నాణ్యమైన విత్తనాలు అందించాలి



**ప్రజాపక్షం/హాలియా:** రైతులకు ఈ ఖరీఫ్‌లో నాణ్యమైన పత్తి విత్తనాలను సరఫరా చేయాలని మండల తాహసిల్దార్ చందర్రావు,ఎస్ఐ సాయి ప్రశాంత్,వ్యవసాయ అధికారి వెంకన్నలు అన్నారు.మంగళవారం హాలియాలోని పత్తి విత్తనాలు విక్రయిస్తున్న వివిధ షాపులను టాస్క్ ఫోర్స్ బృందం ఆకస్మికతనిఖీలు చేపట్టారు.దీనిలో భాగంగా మండల కేంద్రమైన హాలియాలోని వెంకటేశ్వర ఆగ్రో ఏజెన్సీస్ సాగర్ రోడ్డులోని లక్ష్మీ ప్రసన్న ఎంటర్ప్రైజెస్ షాపులలో పత్తి విత్తనాలను తనిఖీ చేసి గోడౌన్ లో ఉన్న పత్తి విత్తన ప్యాకెట్ నిలువలను పరిశీలించారు. పత్తి విత్తనాల స్టాక్ రికార్డులు వివిధ కంపెనీల ఇన్వాయిసులను తనకి ఇచ్చే పెట్టారు. నకిలీ పత్తి విత్తనాలను విక్రయించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వీరు హెచ్చరించారు.ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ విత్తనాలను విక్రయించాలని షాపు యజమానులకు సూచించారు.రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించేలా వ్యవహరించే విత్తనవిక్రయ యజమానులపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు.రైతులకు విత్తనాలు విక్రయించిన తర్వాత రసీదులు తప్పనిసరిగా చెల్లించాలని ఆయా షాప్ యజమానులకు సూచించారు.రైతులకు విత్తనాలపరంగా సమస్యలు ఉంటే మండల వ్యవసాయ అధికారులు సంప్రదించాలని తెలిపారు.



## వైభవంగా చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి చేరువ చేస్తున్నామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం అడివిదేవులపల్లి మండలానికి చెందిన కల్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కులను క్యాంప్ కార్యాలయంలో ఆయన అందించి మాట్లాడారు. అధికారులు పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని, ఎక్కడా దళారుల ప్రమేయం లేకుండా నేరుగా సాయం అందుతుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ నగదును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడవిదేవులపల్లి మండల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నీట్ పరీక్ష పేపర్ లీక్ చేసి లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం ఆయన మాట్లాడుతూ అత్యంత కట్టుదిట్టమైన పహారాలో ఉండాల్సిన పత్రాలు ఈ విధంగా సంతలో కూరగాయలు దొరికినట్లు చేతులు మారడం బాధాకరమన్నారు. ఎన్నో ఆశలతో వేలకు వేలు ఖర్చు పెట్టి హాస్టళ్లలో ఉంటూ కోచింగ్‌లు తీసుకోని రాత్రింబవళ్లు కష్టపడి చదివిన విద్యార్థుల శ్రమ వృధా అయినట్లేనని అన్నారు. పేపర్ లీకేజి వ్యవహారాన్ని సీబీఐ చేత ఎంక్వయిరి చేయించాలన్నారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, రాంబాబు, లవన్‌కుమార్, సతీష్, వెంకటేష్, నవీన్, సందీప్, గౌతమ్, శిల్ప, అశ్విని, స్వాతి, లావణ్య, సునీత, సరస్వతి, వెన్నెల, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## యోగా అలవాటు చేసుకోవాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫసర్ బెల్లి యాదయ్య అన్నారు. విద్యావారోత్సవాల్లో భాగంగా కళాశాలలో నిర్వహించిన విద్యాభివృద్ధియోగా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అతిథిగా పాల్గొన్న వైదిక్ యోగా ట్రస్ట్ నిర్వాహకులు కరుణాకర్ గురూజీ విద్యార్థులకు యోగా ప్రదర్శనలు నిర్వహించి, ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో యోగాను అలవరచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమానికి చరిత్ర సహాచార్యులు కె. ప్రవీణ్ రెడ్డి అనుసంధానకర్తగా వ్యవహరించగా,వైస్ ప్రిన్సిపాల్ నాగు,అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

## భగీరథను అరెస్టు చేయాలని రాస్తారోకో

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నేరేడుచర్ల పట్టణంలోని బిఆర్ఎస్‌వి విద్యార్థి విభాగం, యువజన సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి, బండి సంజయ్, బండి సాయి భగీరథ చిత్రపటాలను దగ్ధం చేశారు. ప్లాకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎండి షోయబ్, పల్లెపంగు నాగరాజు, పెరుమాళ్ల సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

## ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ఉపాధి హామీ కూలీలు ఉదయం ఆరు గంటలకే పని ప్రదేశానికి చేరుకుని అనుకున్న లక్ష్యంతో పనిచేసి ప్రతిరోజు 307 రూపాయల కూలి పొందాలని సర్పంచ్ కీత వెంక టేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల పరిధి లోని కట్టవారిగూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కూలీలకు వడదెబ్బ తగలకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గందె ఉపేందర్‌రావు, నాయకులు మీసాల రాధిక, బాలూరి విజయకుమారి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు శీలం శ్రీనివాస్, బాల్దూరి వెంకటేశ్వర్లు, ఉటుకూరి రాజు, ఆశా వర్కర్లు మీసాల అరుణ, సీనియర్ మేట్ గందె స్వాతి పాల్గొన్నారు.

## నిజమైన కార్యకర్తలకు చోటు కల్పించాలి



**ప్రజాపక్షం/నకిరేకల్** :వడ్డెర కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నిజమైన కార్యకర్తలకు అవకాశం కల్పించాలని తెలంగాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కోడిదెల అంజయ్య డిమాండ్ చేశారు.మంగళవారం నకిరేకల్‌లో తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్టు సభ్యు లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లా డారు.వడ్డెర హక్కుల సాధన కోసం పనిచేయని వారికి కార్పొరేషన్ బాధ్యతలు ఇవ్వడం సమం జసం కాదన్నారు. సంఘ పెద్దల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం బాధాకరమన్నారు. ఈకార్యక్రమంలో గొలుసుల శ్రీనివాస్,కొడదల నరసింహ,పల్లపు నగేష్, కుంచం ఉపేందర్,కొడదల వీరబాబు,కుంచం మహేష్,కుంచం ఆకార మహేష్,కొడదల శీను తదితరులు పాల్గొన్నారు.

## నీళ్ళు తాగడానికి వెళ్లి కోడె మృతి

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండలంలోని జాన కిపురం గ్రామానికి చెందినరైతు గోడిశాల సోమ య్య తండ్రి నారయ్య పశువులు నీళ్ల తాగడానికి వెళ్లి బిక్కేరువాగు చిన్నపడిశాల చెక్ డ్యామ్‌లో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయిందని రైతు కన్నీరు మున్నీరుగా విలపించాడు. కోడె విలువ సుమారు రూ.80,000 ఉంటుందని తన ను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు. ఈ ఘటనపై రెవిన్యూ అధికారులు పంచనామా నిర్వహించారు. ప్రజా ప్రతినిధుల, వారి కుటుంబ సభ్యులను లక్ష్యంగా సోషల్ మీడియాలో కం టెంట్ పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి..



## ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో పట్టణ సిఐకి ఫిర్యాదు



**ప్రజాపక్షం/భువనగిరి :** ప్రజా ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకొని వారికి పరువు నష్టం కలిగే విధంగా అనుచిత వ్యాఖ్యలు, బెదిరించే విధంగా సోషల్ మీడియాలో కంటెంట్ పెడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతు ముదిరాజ్ మహాసభ నాయకులు మంగళవారం భువన గిరి పట్టణ సీఐ రమేష్ కి ఫిర్యాదు చేశారు. ఈ సంద ర్భంగా మహాసభ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొలుపుల హరినాథ్, సాదు విజయ్ కుమార్ లు మాట్లా డుతూ నాగర్ కర్నూలు జిల్లా కోనేటిపూర్ గ్రామానికి చెందిన నూకం జాన్ ముదిరాజ్, వనపర్తి జిల్లా మను గిల్ల గ్రామానికి చెందిన వై.శివ ముదిరాజ్, అల్లదుర్గం సురేష్ లు ప్రముఖ ప్రజా ప్రతినిధులైన ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, ఎంపి ఈటెల రాజేందర్, మంత్రి వాకిటి శ్రీహరిల పై సోషల్ మీడియా వేదికగా ఉద్దేశపూర్వ కంగా విపరీతమైన దుర్భషలాడుతు, అసహ్యమైన భాషతో బెదిరించే విధంగా కంటెంట్ తయారు చేసి పెడుతున్నారని ఆరోపించారు. వీరు తయారు చేసే కంటెంట్ ప్రముఖులపై వ్యక్తిగతంగానే కాకుండా వారి కుటుంబ సభ్యులపై కూడా అనుచితంగా ఉండే విధంగా వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. నూకం జాన్ అలి యాస్ నాని 'జనతా న్యూస్, ఆప్ ముదిరాజ్ హిస్టరీ టివి సిఈఓగా ఉండి వీటి ద్వారా ముదిరాజ్ కమ్యూనిటి నాయకులను అత్యంత అవమానకరమైన బాషను ఉ పయోగిస్తు వారిని తిడుతు వారిని బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఇతనిపై 196(1), 197(1), 299, 352, 353(1)(2), 356(2) కేసులు నమోదు చేశారని చెప్పారు. వారిపై సమగ్ర విచారణ చేసి సంబంధిత చట్టాల ప్రకారం తగిన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెంట నర్సింహా, కన్వీనర్ ఉడుత భాస్కర్, జిల్లా నాయకులు పిట్టల బాలరాజు, కనక బాలరాజు బోయిని బాలయ్య. పిట్టల రాములు. ఇట్టబోయిన గోపాల్, ఎనబోయిన జహంగీర్, గీస కొండల్ పాల్గొన్నారు.

## మే 15న దేశవ్యాప్త గ్రామీణ సమ్మె




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** వివిబీజీ రాంజీ చట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని తెలం గాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య డిమాండ్ చేశారు.మంగళవారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమా వేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి మే 15న జరిగే దేశవ్యాప్త గ్రామీణ సమ్మెను ఉపాధిహామీ కార్మికులు జయప్రదం చేయా లని పిలుపునిచ్చారు.ఉపాధిహామీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల పూడికతీత, రోడ్లు, కాలువలు, భూముల అభివృద్ధి వంటి పనులు జరుగుతాయని, పేద కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.పని చేసిన కూలీ సకాలంలో ఇవ్వడం లేదని, పనిచోట మౌలిక సౌకర్యాలు కల్పించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరానికి 200 రోజుల పని, రూ.800 కూలీ,పెండింగ్ వేతనాల చెల్లింపు,ఈకేవైసీ రద్దు, పని ప్రదేశంలో తాగునీరు, నీడ, వైద్య సౌక ర్యాలు, ఉచిత బీమా, రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా వంటి డిమాండ్లను వినిపించారు.సమావేశంలో వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన్న వెంకులు, కంబాలపల్లి ఆనంద్,సుకన్య,ఉడుగుండ్ల రాములు, మన్నె బిక్షం, రాములు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతకు ఆర్ఆర్ఆర్ కేంద్రాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పర్యావరణ పరిరక్షణ తోపాటు పరిశుభ్రతకు ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయని సూర్యాపేట మున్సిపల్ చైర్‌ప ర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మీ అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపయోగించిన వస్తు వులు మళ్ళీ వినియోగంలోకి తీసుకురావడం ద్వారా మేలు జరుగుతుందన్నారు. ఇంటి వద్ద, కార్యాల యాలు, వ్యాపార సంస్థల్లో వినియోగించి పక్కకు పెట్టిన వస్తువులను సేకరించి మళ్ళీ వినియోగంలోకి తేవాలన్నారు. పాతబట్టలు, పుస్తకాలు, బొమ్మలు, ప్లాస్టిక్ వస్తువులు, గాజు సీసాలు, లోహ వస్తువులు,



పేపర్, ఎల్రక్టానిక్ వంటి వస్తువులను సేకరించాల న్నారు. పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది ఎంతో మేలన్నారు. ప్రజలు తమ ఇండ్లలోని చెత్తను తడి, పొడి గా విడి విడిగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి, కౌన్సిలర్లు కొంతం రాజేష్, గండూరి రమేష్, డిఇ సత్యరావు, శాన టరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అధిక రసాయనాల వినియోగంతో భూసారం తగ్గుదల

**ప్రజాపక్షం/చివ్వెంల :** రైతులు పంట సాగులో అధిక రసాయనాలు వినియోగించడం వల్ల భూసారం తగ్గి పంట దిగుబడి ఘననీయంగా పడిపోతుందని జయశం కర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవే త్తలు అరుణకుమారి, సునీత అన్నారు. మంగళవారం మండలంలోని గాయంవారిగూడెం గ్రామంలో వ్యవ సాయ శాఖ ఆధ్వర్యంలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయనాలు అధికంగా వాడడం వల్ల సాగులో ఖర్చు కూడా పెరుగుతుందన్నారు. వరి పంటలో ఖాళీ బాటలు ఏర్పాటు ప్రయోజనాలు అనే అంశంపై రైతులకు వివరించారు. వరి పంటలో ప్రతి 8 నుండి 10 వరసలకు ఖాళీ బాట ఏర్పాటు చేయడం రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. దీని ద్వారా ఎరువులు వేయడం, పురుగుమందుల పిచికారి, కలుపు నివారణ, వ్యవసాయ పనులు సులభంగా చేయ వచ్చన్నారు. దీనివల్ల గాలి ప్రసరణ, సూర్యకాంతి మెరు గుపడి తెగుళ్ళ తీవ్రత తగ్గి దిగుబడి అధికంగా వస్తుంద న్నారు. పత్తి పంటలో కాండంపూత పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే రైతులు పంటలు మార్పిడిని చేయడం వల్ల అధిక దిగుబడులు వస్తాయ న్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికా రిణి బి. శైలజ, రైతులు రాములు నాయక్, మల్సూర్, కృష్ణయ్య, శ్రీను పాల్గొన్నారు.

## ఐటిఐ,ఎటిసిల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు ప్రారంభం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** 2026/27/28 విద్యా సంవత్సరా నికి ఐటీఐ,ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) కోర్సుల్లో అడ్మిష న్లకు మొదటి విడత దరఖాస్తుల స్వీకరణ మే 14 నుంచి ప్రారంభ మవుతుందని నల్లగొండ జిల్లా ఐటిఐ కన్వీనర్,ప్రిన్సిపాల్ ఎ.నర్సింహాచారి తెలిపారు. నల్లగొండ జిల్లాలోని ఒక ఏటీసీ, నాలుగు ప్రభుత్వ, పది ప్రైవేట్ ఐటీఐల్లో ఒకటి,రెండు సంవత్సరాల కోర్సులకు జూన్ 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చ న్నారు.10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులువెబ్‌సైట్‌లో మొబైల్ నెంబర్‌తో రిజిస్టర్ చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని సూచిం చారు.తెలంగాణలో 1నుంచి 7వ తరగతి వరకు చదివిన వారిని స్థానిక అభ్యర్థులుగా పరిగణిస్తారని చెప్పారు.ఒకే రిజిస్ట్రేషన్‌తో తెలంగాణలోని ఏ ప్రభుత్వ,ప్రైవేట్ ఐటీఐలోనైనా దరఖాస్తు చేసుకో వచ్చని,1,2 సంవత్సరాల కోర్సుల్లో ప్రాధాన్యత ప్రకారం ఎక్కువ ఆప్షన్లు ఎంచుకోవచ్చని తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ ఉర్దూ అకాడమీ ఆధ్వ ర్యంలో మైనారిటీ విద్యార్థుల కోసం నిర్వహించబడుతున్న ఉచిత కంప్యూటర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానించబ డుతున్నట్లు ట్రైనింగ్ సెంటర్ ఇంచార్జ్ ఫ్యాకల్టీ సయ్యద్ యాసుఫ్ తెలిపారు.మైనారిటీ యువతకు నాణ్యమైన కంప్యూటర్ విద్య అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం ఈకార్యక్రమం యొక్క ముఖ్యఉద్దేశ్యంతో అడ్వాన్స్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లి కేషన్స్,మల్టీలింగ్వల్ డిటిపి 6 నెలలు శిక్షణ పూర్తిగా ఉచితం అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉర్దూ అకాడమీ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్,వెటర్నరీ హాస్పిటల్ ఎదురుగా,మిర్యాలగూడ రోడ్ ఆఫీస్ నందు సంప్రదించాలన్నారు.

## ఆరోగ్యవంతమైన జీవన విధానం ద్వారానే ఉన్నతమైన లక్ష్యాలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, ఆరోగ్యవంతమైన జీవన విధానం ప్రతి ఒక్కరు అలవరుచు కోవడం ద్వారానే జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను సాధించడం సులభమవుతుందని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మలిగిరెడ్డి భీమార్జున్‌రెడ్డి అన్నారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం స్థానిక కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో విద్యార్థులకు, అధ్యాపకులకు యోగాపై ప్రత్యేక శిక్షణ కార్య క్రమాన్ని యోగా నిపుణులైన పంతులునాయక్ ఆధ్వర్యంలో నిర్వ హించారు. అనంతరం చరిత్ర అధ్యాపకులు డాక్టర్ పి.రవీందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గుమ్మడి నరేష్, నాగ రాజు, నరేష్, రవీందర్, వెంకటరమణ, నాగరేఖారాణి, స్వప్న తది తరులు పాల్గొన్నారు.

## నర్సులు అంకిత భావంతో పనిచేయాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** నర్సులు అంకిత భావంతో పనిచేయాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షులు పాలవరపు సంతోష్, పిఏసిఎస్ చైర్మన్ గుడి పాటి సైదులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ నర్సుల దినోత్సవం పురస్కరించు కొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ నర్సు సింగం సునీత, నాగలక్ష్మి, అనిత, కవిత, శారదలను పూలమాలలు వేసి శాలువా లతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూప రింటెండెంట్ డాక్టర్ నిర్మల్ కుమార్, క్లబ్ ఉపాధ్యక్షులు తల్లాడ కేదారి, కోశాధికారి గుండగాని రాములు, కోఆర్డినేటర్లు శ్రీనివాస్, గిరి, లక్ష్మ ణ్‌రావు, వెంకటనారాయణ గౌడ్ పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రం పరిశీలన

**ప్రజాపక్షం/నూతనకల్ :** మండలంలోని 25 ధాన్యపు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని 15 రోజుల్లో కొనుగోలు పూర్తి చేయనున్నట్లు మండల తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఎంపిడిఓ సునీత, ఎస్ఐ నాగరాజులతో కలిసి కొనుగోలు కేంద్రాలను పరిశీలన చేసి దిగుమతి త్వరగా చేసుకొనుటకు మిల్లర్లతో మాట్లాడినట్లు వారు తెలిపారు. కాంటాలు పూర్తయిన ధాన్యమును వెంటనే మిల్లులకు తరలించుట, సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి లారీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దిర్శనపల్లి ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం బిక్కుమల్ల చెక్‌పోస్టను సందర్శించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## భూమి కబ్జాను నివారించాలని వినతి

**ప్రజాపక్షం/మోతె :** భూమి కబ్జాను నివారించాలని కోరుతూ తహశీల్దార్ యం. వెంకన్నకు మామిళ్ళగూడెం గ్రామస్తులు వినతిపత్రం అందించారు. మంగళవారం మండలంలోని మామిళ్ళగూడెం గ్రామంలో సర్వే నంబర్ 351 గల ప్రభుత్వ పోరంబోకు భూమి సుమారు 21 గుంటలను గ్రామస్తులు కొందరు ఆక్రమణ చేసి మహనీయుల విగ్రహాల నిర్మాణాలకు అంతరాయం కలిగిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత వ్యక్తులు నుండి ఖబ్జా చేసిన భూమిని మరల ఇప్పించాలని కోరారు. గ్రామస్తులు నవిలె నర్స య్య, వెంకన్న, కొరవి వీరస్వామి, అంబేద్కర్, చిరంజీవి పాల్గొన్నారు.

## దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ (ఆత్మకూర్(ఎస్)) :** అర్హులైన ప్రతి ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ తెలిపారు. సోమవారం ఆత్మకూర్(ఎస్) మండలంలోని బోరింగ్ తండ గ్రామంలో లబ్ధిదారులు గుగులోతు లక్ష్మి ధర్మ ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రతి నియోజక వర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరి చేసిందన్నారు. ప్రతి ఏడాది నియోజక వర్గానికి 3500 ఇండ్ల చొప్పున మంజూరు చేసి ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బోరింగ్‌తండ గ్రామ సర్పంచ్ బిచ్చు నాయక్, నాయకులు రవి నాయక్, వాగ్య నాయక్, గుడి చైర్మన్ నాయక్, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, కుంభం రాజేందర్, అబ్దుల్ రహీం, ధరావత్ వీరన్న నాయక్, అంజద్‌అలీ, తంగెళ్ళ కరుణాకర్ రెడ్డి, ఎలిమినేటి అభినయ్ నాయుడు పాల్గొన్నారు.

## మజ్జిగ పంపిణీ

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండల కేంద్రంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మండల జనసేన పార్టీ నాయకులు సంతోష్ గౌడ్ ఆధ్వర్యంలో బాటసారులు, ప్రజలకు చల్లని మజ్జిగ ప్యాకెట్లు అందచేశారు. నితిన్, అజయ్, సందీప్, సాయి, వేణు, మహేష్, లక్ష్మ ణ్, రమేష్, పెయింట్ షాప్ వినీత్ కుమార్, పవన్,మనీ, మధు పాల్గొన్నారు.




# రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలి

**: జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**ప్రజాపక్షం/అర్వపల్లి :** రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జాజిరెడ్డిగూడెం, నాగారం, తిరుమలగిరి మండలాల పరిధిలోని తిమ్మాపురం, ఈటూరు, తొండ గ్రామాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే తిరుమలగిరి పరిధిలోని వాసవి రైస్ ఇండస్ట్రీస్, ఏఎస్ఆర్ ఇండస్ట్రీస్, సోమేశ్వర రైస్ ఇండస్ట్రీస్‌లను సందర్శించారు. ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడింగ్ చేయాలని, దిగుమతిలో జాప్యం చేయకూడదని మిల్లర్లకు సూచించారు.



కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా నిర్వాహకులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహాశీల్దార్లు శ్రీకాంత్, కంట్లమయ్య, ఎంపిడిఓ ఝాన్సీ, రైస్‌మిల్లు యజమానులు పాల్గొన్నారు.

# ఎనోబుల్ ఫౌండేషన్ సేవలు మరువలేనివి




**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** ఎనోబుల్ ఫౌండేషన్ సంస్థ సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిల్లలమర్రి స్కూల్ నందు జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారి ఆర్థిక సహాయంతో ఎనోబుల్ ఫౌండేషన్ సంస్థ సహకారంతో పాఠశాలలో మరమ్మత్తులు, సుందరీకరణ పనులు, టాయిలెట్స్ పనులు చేపట్టి, ఎస్.టి.ఇ.ఎ.ఎం ల్యాబ్ (సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ మ్యాథ్స్, ఆర్ట్స్ ల్యాబ్) ఏర్పాటు, విద్యార్థులకు కావల్సిన క్రీడా సామాగ్రి అందజేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఎనోబుల్ ఫౌండేషన్ సంస్థను అభినందిస్తూ వారి యొక్క సేవలు మరువలేనివని ముందు ముందు కూడా జిల్లాలోని పాఠశాలలను దత్తత తీసుకొని కావాల్సిన మౌళిక సదుపాయాలు మరమ్మతులు చేపట్టి విద్యార్థుల కొరకు ల్యాబ్స్, క్రీడా సామాగ్రిని అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఇఓ అశోక్, ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, హెడ్‌మాస్టర్ జనార్ధన్, తహశీల్దార్ కృష్ణ య్య, జిఐసి ప్రతినిధులు శ్వేత, శుభద, ఎనోబుల్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు శారద, జయరాజ్, మెహతా, శ్రావణ్ జైస్వాల్, వార్డు కౌన్సిలర్ నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అధిక రసాయనాల వినియోగంతో భూసారం తగ్గుదల

**ప్రజాపక్షం/చివ్వెంల :** రైతులు పంట సాగులో అధిక రసాయనాలు వినియోగించడం వల్ల భూసారం తగ్గి పంట దిగుబడి ఘననీయంగా పడిపోతుందని జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు అరుణకుమారి, సునీత అన్నారు. మంగళవారం మండలంలోని గాయంవారిగూడెం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుముగింట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయనాలు అధికంగా వాడడం వల్ల సాగులో ఖర్చు కూడా పెరుగుతుందన్నారు. వరి పంటలో ఖాళీ బాటల ఏర్పాటు ప్రయోజనాలు అనే అంశంపై రైతులకు వివరించారు. వరి పంటలో ప్రతి 8 నుండి 10 వరసలకు ఖాళీ బాట ఏర్పాటు చేయడం రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. దీనిద్వారా ఎరువులు వేయడం, పురుగుమందుల పిచికారి, కలుపు నివారణ, వ్యవసాయ పనులు సులభంగా చేయవచ్చన్నారు.



దీనివల్ల గాలి ప్రసరణ, సూర్యకాంతి మెరుగుపడి తెగుళ్ళ తీవ్రత తగ్గి దిగుబడి అధికంగా వస్తుందన్నారు. పత్తి పంటలో కాండంపూత పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే రైతులు పంటలు మార్పిడిని చేయడం వల్ల అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి బి. శైలజ, రైతులు రాములు నాయక్, మల్సూర్, కృష్ణయ్య, శ్రీను పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శన

**ప్రజాపక్షం/బీబీనగర్ :** గత 15 రోజులుగా ఐకెపి, పిఏసిఎస్ సెంటర్లలో వరి ధాన్యం నిలిచిపోయి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్న సందర్భంగా మంగళవారం బ్రాహ్మణపల్లి, మగ్దుంపల్లి, చిన్న రావులపల్లి, పెద్దపలుగు తండా గ్రామాల్లో భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి సెంటర్లను సందర్శించి వరి ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన పంట వర్షాలు పడితే దాన్యం తడిసిపోతుందేమోనని ఆందోళనలో ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడంలేదని గత 15 రోజులుగా కాంటాలు వేయకుండా బస్తాలు రాకుండా లారీలు లేకుండా హమాలీలు లేకుండా ధాన్యం నిలిచిపోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 15 వరకు



దాన్యం కొనుగోలు చేయకపోతే రైతులతో మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని మాజీ ఎమ్మెల్యే హెచ్చరించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ ఎరుకల సుధాకర్ గౌడ్, సర్పంచులు ప్రేమలతా, కొమురెల్లి శ్రీకాంత్, టిఆర్ఎస్ నాయకులు గాదె నరేందర్ రెడ్డి, బొక్క జైపాల్ రెడ్డి, రాచమల్ల శ్రీనివాసులు, చింతల సుదర్శన్ రెడ్డి, మల్లగారి శ్రీనివాస్ గుప్తా, పిట్టల అశోక్, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.




## సర్వోత్తమ్ రెడ్డిని కలిసిన నూతన పాలకవర్గ సభ్యులు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులు మంగళవారం ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా పాలకవర్గ సభ్యులుగా ఎన్నికైతనను కలిసిన పోతుగంటి వెంకటేశ్వర్లు, తల్లాడ పల్లవి, బోనగిరి వెంకన్న, మనసాని నాగేశ్వర్ రావు, మర్ల కర్ణాకర్ రెడ్డి, చీదెళ్ళ పర్వతాలు, చల్లా పాండయ్య,లను అభినందించారు. భక్తుల మనోభావాలు కాపాడడంతోపాటు దేవస్థాన అభివృద్ధికి కృషి చేయాలని వారిని కోరారు. అనంతరం పాలకవర్గ సభ్యులు సర్వోత్తమ్ రెడ్డిని, నాయకులు పోతు భాస్కర్‌ను సత్కరించారు.

## దిగుమతులు వేగవంతం చేయాలి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** రైస్ మిల్లుల్లో ధాన్యం దిగుమతులు వేగవంతం చేయాలని ఆర్‌డిఓ వేణుమాధవరావు అన్నారు. మండలంలోని దుపహాడ్, న్యూబంజారా హిల్స్ గ్రామాలలో కొనసాగుతున్న జనగణన 2027 సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మండలంలోని శ్రీరామ రైస్‌మిల్, సువర్ణ జ్యోతి రైస్‌మిల్, వేదాంతీ రైస్‌మిల్, వెంకటసాయి రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకెపి, పిఏసిఎస్ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి పంపుతున్న ధాన్యాన్ని మిల్లుల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా దిగుమతి చేసుకోవాలని యాజమాన్యాలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గుమ్మి రాజశేఖర్ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అజీజ్ ఉనిస, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ నవీన్, ఉపాధ్యాయులు నల్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## విద్యా వారోత్సవాలు

**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రెండవ రోజు విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం విద్యార్థులకు యోగ పట్ల అవగాహన కలిగించడమే కాకుండా డిగ్రీ తర్వాత పోటీ పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలో అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ యోగ ఆరోగ్యాన్ని ఎంతో మెరుగుపరుస్తుందన్నారు.పీజీ పరీక్షలు రాసే విద్యార్థులకు ఆ పరీక్షలపట్ల కళాశాల అధ్యాపకులు డాక్టర్ జె.చిన్నబాబు, డాక్టర్ జి.సునీత అవగాహన కలిగించారు. కార్యక్రమ ఇన్చార్జి, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ ఎం.రవీందర్ రావు విద్యార్థులకు, అధ్యాపకులకు యోగాసనముల పట్ల అవగాహన కలిగించారు.ఈ కార్యక్రమంలో నిర్వహణ సభ్యులు యం.అనిత, టి.శ్రీనివాస్, పరిపాలనాధికారి జి.కరుణాకర్, అధ్యాపకులు డాక్టర్ రత్న మంజుల, డాక్టర్ లక్ష్మి నీలిమ, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య పాల్గొన్నారు.

## ఘనంగా వీడ్కోలు సమావేశం

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలంలోని కక్కిరేణి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చిల్లా మధురవేణి సురేష్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు, ఊరుకు మంచి పేరు తీసుకురావాలని వారి ప్రోత్సాహకరంగా రూ.5000 అందజేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు రాజన్ బాబు పరీక్షకు కావలసిన సామాగ్రిలను అందజేశారు. మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.10000, రెండో బహుమతి రూ.5000 ఇవ్వడం జరుగుతుందని పాఠశాల ఉపాధ్యాయులు శేఖర్ రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నడిగోటి పాండు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఉపేందర్ జీ, గ్రామ పంచాయితీ కార్యదర్శి ఉమా శంకర్, ఏపీసీ చైర్మన్ చిల్లా ప్రభావతి పాల్గొన్నారు.



## వేసవి శిక్షణ తరగతులు సద్వినియోగం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం)** : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో వేసిన శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ కోరా రు. మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో వేసే శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించి మాట్లాడుతూ వేసవి సెలవులలో విద్యార్థులు పెయింటింగ్, డ్రాయింగ్, మ్యాథమెటిక్స్, స్పోకెన్ ఇంగ్లీష్‌పై పదిహేను రోజులపాటు అందజేస్తున్న శిక్షణా కార్యక్రమంలో పాల్గొని, ప్రతిభను పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో జిఈసిఓ రాధ, ఉప సర్పంచ్ మజ్జిగ నరేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## కంఠమహేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండల పరిధిలోని దుబ్బాక గ్రామంలో ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు శ్రీశ్రీ సురమాంబ సమేత కంఠమహేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అభివృద్ధికి రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుండాల నర్సింహ గౌడ్, మాజీ సర్పంచ్ గుండాల నర్సింహ, గుండాల సతీష్, మాజీ సర్పంచ్ గట్టు యాదయ్య, శెట్టి శేఖర్, బత్తుల రమేష్, బిఎన్ గౌడ్, గట్టు శ్రీనివాస్, గట్టు బాలు, గుండాల కిరణ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

## వేసవి శిబిరం

**ప్రజాపక్షం/రామన్నపేట** : మునిపంపుల గ్రామంలో భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో భాగంగా ఉచిత కరాటే శిక్షణ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ రాచకొండ రాజు, నాయకులు తాళ్ళపల్లి జితేందర్, గంటెపాక శివ కుమార్, తొలుపునూరి చంద్ర శేఖర్, బూడిద బిక్షం, జంపాల ఉమాపతి, ఆకుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయం

**ప్రజాపక్షం/రామన్నపేట** : పెరిక కులస్తులను గుర్తించి వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు పెరిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి కోట సుధాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, యాదాద్రి జిల్లా పెరిక కులస్తుల అందరి తరపున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఉగ్గే రాజేష్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కళ కళ కోసం కాదు ప్రజల కోసం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** మండల కేంద్రంలో తెలంగాణ ప్రజానాట్యమండలి సమావేశం దుప్పలి సరిత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు భూషిపాక నరసింహ, జిల్లా కార్యదర్శి చెక్క వెంకటేష్ హాజరై మాట్లాడుతూ కళ కళ కోసం కాదు ప్రజల కోసమని నాటి తెలంగాణ రైతంగా సాయుధ పోరాటం మొదలుకొని నేటి తెలంగాణ మలిదశ ఉద్యమం వరకు ఎందరో కవులు కళాకారులతో పాటు ఉద్యమానికి ఊతమని ఇచ్చారు. ఇలాంటి కవులు, కళాకారులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కలెక్టర్ కార్యాలయంలో పెండింగ్లో ఉన్న అప్లికేషన్ ఫామ్ పై సంతకం చేయాలని, ఇండ్లు లేని నిరుపేద కళాకారులకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి, కళాకారులకు పెన్షన్ అందజేయాలన్నారు. గత ప్రభుత్వం విస్మరించింది. ఈ ప్రభుత్వమైనా కళాకారులకు ఆర్థికంగా చేయూతనివ్వాలని వారన్నారు. ఈనెల 20వ తారీఖున తెలంగాణ ప్రజానాట్యమండలి




జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, ఆత్మకూరు టౌన్ కార్యదర్శి మజ్జిగ నరసింహ, కళాకారులుపాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. తెలంగాణ ప్రజానాట్యమండలి ఆత్మకూరు మండల అధ్యక్షురాలుగా సంగపాక రేణుక, కార్యదర్శిగా దుప్పిలి సరిత 11 మంది కమిటీ సభ్యులతో ఏర్పాటు చేశారు.

# రైతుల వద్దకు శాస్త్రవేత్తలు



**ప్రజాపక్షం/చందంపేట**; నల్గొండ జిల్లా చందంపేట మండలంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు తెలంగాణ వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతుల వద్దకు శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మంగళవారం మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త డా. నళిని మాట్లాడుతూ అవసరం మేరకే యూరియా, రసాయనాలను వాడాలని, పంట మార్పిడి చేయాలని, పప్పు ధాన్యాలు సాగు చేసి పూత దశలో నెలలో భూసారాలను పెంచే పద్ధతులను గురించి రైతులకు వివరించారు. శాస్త్రవేత్త స్వాతి మాట్లాడుతూ తాగునీటిని ఆదా చేయాలని మార్కెట్లో గిరాకి ఉన్న రకాలను గురించి రైతులకు వివరించారు. మండల ఏవో లక్పతి మాట్లాడుతూ పంటలు వేసే ముందు వ్యవసాయ అధికారులతో భూసార పరీక్షలు చేయించుకోవాలని, నాణ్యమైన విత్తనాలను వాడాలని, రైతులు విత్తనాలు కొనేముందు బిల్లులను తప్పని సరిగా పొందాలని సూచించారు. రైతులు నకిలీ విత్తనాల బారిన పడి నష్టపోకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు.

# భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి హనుమత్ జయంతి సందర్భంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటి సభ్యులు, ప్రధాన పూజార్లు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. దర్శన అనంతరం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ముదిరెడ్డి రమణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు వల్దాసు దేవేందర్, తండు శ్రీనివాస్, నాయకులు మర్ల కరుణాకర్ రెడ్డి, దండ అరవింద రెడ్డి, ధరావత్ ధర్మా నాయక్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని 11వ వార్డు నందిపహాడ్‌లో శ్రీ అభయాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పాల్గొని స్వామివారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్‌రావును శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట కౌన్సిలర్ మర్రి



అంజిబాబు, పాలరపు సత్యనారాయణ, గోవింద్‌రెడ్డి, బెడుదూరి శ్రీనివాస్‌రెడ్డి, రాంబాబు, కృష్ణయ్య, వెంకన్న, సైదిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ఆంజనేయ స్వామి ప్రజలను చల్లగా చూడాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ కోరారు. అనంతరం దేవాలయ చైర్మన్ కొత్తా ఆంజనేయులు, ఇఓ లక్ష్మ ణ్ రావులు వీరిని ఘనంగా సత్కరించారు. మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, గునగంటి హేమసతీష్, సునీల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్ నాయుడు, నాయకులు పోలగాని బాలు గౌడ్‌పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/రామన్నపేట** : యాదాద్రి భువనగిరిజిల్లా రామన్నపేటమండల పరిధిలోని బోగారంగ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోగారం హనుమాన్ గుడిలో భక్తిశ్రద్ధలతో భక్తులు హోమం, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని, దాత పాండునాథ్ వర్షిని దంపతులు నిర్వహించారు.





## బిఆర్ఎస్ నాయకులు రైతులను తప్పుదోవ పట్టించి దుష్ప్రచారం చేస్తున్నారు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : వరిధాన్యం కొనుగోలు విషయంలో బిఆర్ఎస్ నాయకులు రైతులను తప్పుదోవ పట్టించి దుష్ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తూ రైతుల పక్షాన నిలబడి కొనుగోళ్లలో అవకతవకలు జరగకుండా ప్రత్యేక దృష్టి పెట్టిందని తరుగు పేరుతో ధాన్యాన్ని దోచుకోవటం అవాస్తమని పిఎసిఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్ జిల్లా కిసాన్ జిల్లా అధ్యక్షులు మర్రి నర్సింహారెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోచంపల్లి మండలంలోని కొన్ని గ్రామాలలోని ఐకెపి కొనుగోలు కేంద్రాలను మాజీ ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి సందర్శించి ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని అనటం విడ్డూరంగా ఉందని ఎద్దేవ చేశారు. ఆయన వెంట మాజీ పట్టణ అధ్యక్షులు భారత లవ కుమార్, ముప్పిడి శ్రీనివాస్, బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాసులు రైతులు ఉన్నారు.

## రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రైతుల కు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించినట్లుగా పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు విత్తనాల ఎంపిక ఎరువుల వినియోగం చీడపీడల నివారణ చర్యలపై రైతులు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు శాస్త్రీయ విధానాలను అనుసరిస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పూజ, సర్పంచ్ బీర య్య, నారాయణపురం ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి, వార్డు సభ్య లు,వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : భువనగిరి మండలం గౌస్ నగర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సైరెడ్డి జంగారెడ్డి సతీమణి పావని అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే భువనగిరి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత పైళ్ల శేఖర్ రెడ్డి జంగారెడ్డి కుటుంబాన్ని ఓదార్చి శ్రద్ధాంజలి ఘటించారు. ఆ కుటుంబానికి మనోధైర్యం చెప్పి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ భువనగిరి మండల పార్టీ అధ్యక్షుడు తుక్కాపురం సర్పంచ్ జనగాం పాండు, మాజీ సింగిల్ విండో చైర్మన్ బాల్గురి మధుసూదన్ రెడ్డి, భువనగిరి మండల సర్పంచ్ల పోరం అధ్యక్షుడు జక్కా రాఘవేంద్ర రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ పుష్ప కృష్ణ పాల్గొన్నారు.

## నీట్ లీకేజీపై ఎస్ఎఫ్ఐ ఆందోళన

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్**: నీట్ పరీక్ష లీకేజీకి నిరసనగా ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి,ఎన్టీఏ సంస్థల దిష్టిబొమ్మలను దహనం చేశారు.రామగిరి పానగల్ రోడ్డుపై జరిగిన ఈనిరసనలో జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ ఎన్టీఏ తప్పిదంతో మే3న జరిగిన నీట్ పరీక్ష లీక్ అయ్యిందని,దీంతో 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకమైందన్నారు.విద్యను కేంద్రీకరించడం వల్లే పేపర్ లీకేజీలు పెరిగాయని,ఎన్టీఏను రద్దు చేసి ప్రవేశ పరీక్షల నిర్వహణ హక్కును రాష్ట్రాలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మమత,సంధ్య,మానసా, కల్పన పాల్గొన్నారు.



## ఆత్మీయ సమ్మేళనానికి ఆర్‌టిసి నాయకులు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణానికి చెందిన ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు ఆత్మీయ సమ్మేళనానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా రిజియన్ కార్యదర్శి గోపనబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ హైద్రాబాద్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌లు హాజరు కానున్నారన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయనున్నందున కార్మికుల తరపున హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్, బొలిశెట్టి సత్యనారాయణ, శ్యామ్, ఎంఎస్.రెడ్డి, అఖిల్, మహేందర్, సోమయ్య, సైదమ్మ, చంద్రకళ, మేరీ తదితరులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఇన్‌చార్జి ఏడీఏ రుషేంద్రమణి అన్నారు. మంగళవారం పట్టణం, మండలంలోని ఎరువుల దుకాణాలను, గోదాములను తనిఖీ చేశారు. నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ గోదామ్, మల్లిఖార్జున అగ్రో కెమికల్స్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాముల్లో ఎరువుల నిల్వలను తనిఖీ చేసి అనంతరం ఆమె మాట్లాడుతూ ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆయా గోదాముల్లో, దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు.

## బూరుగు భాగ్యమ్మ మృతికి మాజీ ఎమ్మెల్యే నివాళి

ప్రజాపక్షం/తుర్కపల్లి : మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బూరుగు మధుసూదన్ రెడ్డి మాతృమూర్తి బూరుగు భాగ్యమ్మ మరణించిన విషయం తెలుసుకున్న మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్, గొంగిడి సునిత మహేందర్ రెడ్డి, భాగ్యమ్మ పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆమె వెంట బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి, మండల నాయకులు నరేందర్ రెడ్డి, గిద్దె కరుణాకర్, చాడ కరుణాకర్ రెడ్డి, ఓర్సు భిక్షపతి, గ్రామస్తులు ఉన్నారు.

## బాధ్యతలు స్వీకరణ

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : పోచంపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆర్.భాస్కర్ పదోన్నతి పొంది జనగాం జిల్లా డిఆర్‌డిఓ అధికారిగా బదిలీ అయినందున, ఆస్థానంలో ప్రస్తుతం ఎఫ్‌ఏసి అధికారిక పని చేస్తున్న సూపరింటెండెంట్ ఏ సత్యనారాయణ రెడ్డి మంగళవారం ఎండిఓగా పూర్తి బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ సీఈఓ ఆదేశాల మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పూర్తి భాధ్యతలు అప్పగించి ట్రాన్స్ఫర్ అయిన ఎండిఓ భాస్కర్ విధుల నుండి విడుదల అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఇరువురిని ఘనంగా సన్మానించారు.

# బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

**మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు**

ప్రజాపక్షం/చండూరు :మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను వెంటనే తొలగించాలని మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన చండూరులో ప్రజాపక్షంతో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో చాలా మంది బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నారని, బెల్ట్ షాపులు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించడం వల్ల మున్సిపాలిటీలో రోడ్డు ప్రమాదాలు,గొడవలు,కొట్లాటలు జరిగి శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని అన్నారు.ఎక్సైజ్ అధికారులు,పోలీస్ శాఖ వారు బెల్ట్ షాపులపై నిరంతరం నిఘా పెట్టాలని అన్నారు. బెల్ట్ షాపులు నిర్వహించిన వారిపై కేసులు పెట్టి జరిమానాలు విధించి బైండోవర్లు చేయాలని అన్నారు. చండూరు మున్సిపాలిటీ పరిధిలో చాలా వీధులలో బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయని,ఉదయం 5 గంటల నుండి మద్యం సేవించి చాలామంది మద్యానికి బానిసలు అయ్యారని అన్నారు.మద్యానికి బానిస కాకుండా కుటుంబాలు,సమాజం బాగుండాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిత్యం బెల్ట్ షాపుల నివారణకు పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ,కౌన్సిలర్లు కోడి సుష్మా వెంకన్న,తేలుకుంట్ల రాజకుమారి శేఖర్,కలిమికొండ పారిజాత జనార్దన్,జెల్ల ధనమ్మ శ్రీనివాసులు,ఋషిపాక వాసు,కటకం రమేష్, కొండ్రెడ్డి మధు,సామ సుజాత యాదవ రెడ్డి,కోఆప్షన్ సభ్యులు కల్లెట్ల చంద్రకళ మారయ్య,ఖలీల్, వెంకన్న పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో



ప్రజాపక్ష/చింతపల్లి : వరి ధాన్యం సకాలంలో కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ వద్ద నాగార్జున సాగర్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మండల పరిధిలో ఏర్పాటు చేసిన చింతపల్లి, తీదేడు, కుర్మేడులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారులు సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వరి ధాన్యం తరలించేందుకు సరిపడ లారీలను ఏర్పాటు చేయకపోవడంతో పాటు, హమాలీల కొరత ఏర్పడడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు ఓ వైపు ఇప్పటికే వందలాది వరి ధాన్యం కుప్పలు మార్కెట్లలో నిలువ ఉండడంతో ఏప్పుడు వర్షం వచ్చి ధాన్యం తడుస్తుందేమోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు అధికారులు, ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ పండించిన పంటను సరైన సమయంలో కొనుగోలు చేయకపోవడంతో ఎక్కడి వరి ధాన్యం అక్కడే మిగిలిపోయింది. నెల రోజుల నుంచి మార్కెట్ యార్డులలో వరి ధాన్యం ఉంచినప్పటికీ కొనే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి సకాలంలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు అధికారులను కోరారు.

# రేషన్‌డీలర్‌పై చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/చింతపల్లి : రేషన్ లబ్దిదారులకు బియ్యం పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం వహించిన రేషన్ డీలర్ పై చర్యలు తీసుకోవాలని ఉమ్మాపురం గ్రామస్తులు మంగళవారం తాసిల్దార్ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. మండల పరిధిలోని ఉమ్మాపురం గ్రామంలో 37వ రేషన్ షాప్ డీలర్ లబ్దిదారులకు మూడు నెలలకు సంబంధించిన రేషన్ సరఫరా చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గతనెల ఏప్రిల్ 30వ తేదీన ఒకరోజు మాత్రమే రేషన్ బియ్యం ఇచ్చాడన్నారు. మిగతా రోజులలో రేషన్‌షాప్ మూసివేసి బియ్యం సరఫరా చేయకపోవడంతో చాలామంది బియ్యం తీసుకోలేదని వారు తాసిల్దార్‌కు విన్నవించారు. రేషన్ డీలర్ విధుల పట్ల నిర్లక్ష్యం వహించి, లబ్దిదారులకు బియ్యం పంపిణీ చేయనందున అతని పై కఠిన చర్యలు తీసుకొని విధుల నుంచి తొలగించి, మూడు నెలలకు సంబంధించిన బియ్యాన్ని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మాపురం గ్రామస్తులు తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు మల్లోజు శేఖరాచారి, కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు కేశగోని రవి, వార్డు సభ్యులు మల్లోజు మంజుల, శిరసవాడ దయానంద్ నాగరాణి, గ్రామస్తులు మణెమ్మ, వరమ్మ, వెంకటమ్మ, సత్తెమ్మ, కనుకమ్మ, అలివేలు, హైమావతి, లక్ష్మమ్మ, యాదమ్మ, కలమ్మ, రాములమ్మ, చంద్రమ్మ, భాగ్యమ్మ, లలిత, యశోద తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచారంలా ప్రైవేట్ పాఠశాలల ప్రచారం...

ప్రజాపక్షం/దేవరకొండ; ఎన్నికల ప్రచారం లా ప్రైవేట్ పాఠశాలలు ప్రచారం నిర్వహిస్తున్నాయని బిఆర్ఎస్‌వి దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డపల్లి కృష్ణ అన్నారు. మంగళవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ప్రచారం నిర్వహిస్తున్నా నిమ్మకు నీరేత్తినట్లు అధికారుల వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిఆర్ఎస్‌వి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్‌వి మండల అధ్యక్షులు లక్ష్మణ్, కౌన్సిలర్ మధు, జమీర్‌బాబా, అభి పాల్గొన్నారు.





## తాత్కాలిక టెండర్లపై విచారణ జరిపించాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: 2024 ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు నిర్వహించిన తాత్కాలిక ఎఫ్‌సీఐ టెండర్లలో కాంట్రాక్టర్ అవకతవకలకు పాల్పడ్డారని హమాలీలకు రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా కాజేశారని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎఫ్‌సీఐ డీపీఎస్ కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌నాయక్, పాండునాయక్‌లు అన్నారు. మంగళవారం ఎఫ్‌సీఐలో హమాలీలతో కలిసి వారు మాట్లాడుతూ తాత్కాలిక టెండర్ పేరుతో మూడు నెలల పాటు కాంట్రాక్ట్ పనులు చేపట్టిన ధనావత్ భిక్షానాయక్ కోట్ల రూపాయల హమాలీల డబ్బులను ఇవ్వకుండా కాజేశారని పేర్కొన్నారు. ఎఫ్‌సీఐ సొసైటీ అధ్యక్షుడిగా ఇటు తాత్కాలిక కాంట్రాక్టర్‌గా వ్యవహరించి హమాలీల సొమ్మును కాజేశారని అన్నారు. ఇదే విషయమై పలుమార్లు హమాలీలు నిలదీసినా కాలయాపన చేస్తూ దాట వేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ఎఫ్‌సీఐ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, హమాలీలకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలన్నారు. సమావేశంలో హమాలీ కార్మిక సంఘం నాయకులు సైదులు, విజయ్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## కరపత్రాలు ఆవిష్కరణ



ప్రజాపక్షం/గుండాల; తెలంగాణ ప్రజా నాట్యమండలి యాదాద్రి భువనగిరి జిల్లా మూడవ మహాసభల కరపత్రాలను మంగళవారం గుండాల మండల కేంద్రంలో తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కల కల కోసం కాదు కల ప్రజల కోసం ప్రజా చైతన్యం కోసం మొట్టమొదటిగా నినాదించింది తెలంగాణ ప్రజా నాట్యమండలి అని దేశంలోని కళాకారులందరిని సమీకరించి కళారూపాల ద్వారా స్వాతంత్రం కోసం తెలంగాణ సాయుధ పోరాటంలో తెలంగాణ ఉద్యమంలో కళాకారులను ఒక తాటిపై నడిపి తెలంగాణను సాధించుకున్నదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కళాకారునికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వృద్ధ కళాకారులకు పెన్షన్ 5వేలు ఇవ్వాలని, ఆర్టీసిలో ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించాలని, కళాకారులందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, మినీ ఆడిటోరియం నిర్మించాలని అన్నారు. అనంతరం నూతన మండల కమిటిని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా జోగు స్వామి, ఉపాధ్యక్షులు శంకరయ్య, ఉపాధ్యక్షురాలు కళమ్మ, కార్యదర్శి నర్సమ్మ, కోశాధికారి ఐలయ్య, కార్యదర్శి అందాలు, సభ్యులు ధనమ్మ, అనిత, లక్ష్మీ, కిష్టమ్మ, బుచ్చమ్మ, కళమ్మలను ఎన్నుకున్నారు.

## భగవాన్ నాయక్ మృతి బాధాకరం



ప్రజాపక్షం/తుర్కపల్లి : మండలంలోని ధర్మారం గ్రామ రేషన్ డీలర్ భర్త, మాలోతు భగవాన్ నాయక్ మృతి చెందాడు. కాగా మంగళవారం రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలుగల రాజయ్య, రాష్ట్ర కార్యదర్శి గంగాదేవి మహేష్‌లు భగవాన్ నహక్ భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారితో పాటు జిల్లా ఉపాధ్యక్షుడు సూర్పి వెంకటేష్ గౌడ్, తుర్కపల్లి మండల రేషన్ డీలర్ అధ్యక్షుడు కుకుటపు నవీన్ కుమార్, గౌరవ అధ్యక్షుడు కందుకూరి అమరనాథ్, ఆయా గ్రామాల రేషన్ డీలర్లు గడ్డమీది మురళి, డి.లక్ష్మణ్ నాయక్, సర్వన్ నాయక్, టి.చంద్యా, ఎం.నగేష్, మంగ్యా నాయక్, పిన్ రెడ్డి బాల్ రెడ్డి, గూగులోత్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.